7న తెలంగాణ వ్యాప్తంగా ఆటో బంద్



నారాయణగూడలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఆటో, క్యాబ్స్ డ్రైవర్స్ సంఘాల జేఏసీ నేతలు

కాచిగూడ: ఆటో డ్రైవర్లపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ డిసెంబర్ 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఆటో బంద్‌కు తెలంగాణ ఆటో, క్యాబ్స్ డ్రైవర్స్ సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం (ఏఐటీయూసీ) రాష్ట్రవ్యాప్త ఆటో బంద్ పోస్టర్‌ను సోమవారం నారాయణగూడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోకుంటే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఏమాత్రం సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని విమర్శించారు.రాష్ట్ర వ్యాపిత ఆటో బంద్‌లో ఆటో డ్రైవర్లు అందరూ పాల్గొని విజయంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జేఏసీ నేతలు వి.ప్రవీణ్ (టీయూసీఐ), ఎ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), మీర్జారఫాత్ బేగ్ (ఆటో ఓనర్స్ అసోసియేషన్), ఎస్.రామకృష్ణ (బీఆర్‌టీయూ), బి.తిరుమలేస్ గౌడ్, శ్రీనివాస్, శంకర్‌రెడ్డి (క్యాబ్స్ యూనియన్) తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు నైట్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి



ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న అభ్యాగుడికి దుప్పటి కప్పుతున్న ప్రవీన్‌కుమార్

అంబర్‌పేట: చలితో వణికిపోతున్న అభాగ్యులకు అయప్ప మాలధారుడు అపన్న హస్తం అందించాడు. బాగ్ అంబర్‌పేటకు చెందిన బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్రవీన్‌కుమార్ ఆదివారం రాత్రి చలితో ఇబ్బందులు పడుతున్న అభాగ్యులకు దుప్పట్లు అందించారు. కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి హిమాయత్‌నగర్ మీదుగా చెక్ పోస్టు వరకు ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారందరికి 150 దుప్పట్లను స్వయంగా కప్పారు. దుప్పట్లను కప్పుతుంటే అభాగ్యుల కృతజ్ఞాత భావం తనను చెలింపజేసిందన్నారు. ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారికి నైట్ షెల్టర్‌లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయండి



హరినగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని హరినగర్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం జరిగితే కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయన సోమవారం హరినగర్‌లో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... హరినగర్ అబ్బసాయి మెన్షన్ నుంచి ఎస్సార్టీ పార్కు వరకు రోడ్డు నిర్మాణం కోసం తవ్వకాలు జరిపి నెలరోజులైనా ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. తవ్వి వదిలేసిన రోడ్డు వల్ల వాహనాదారులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, నాయకులు కేశవపురం అరుణ్, ముదిగొండ మురళీ, కొండమడుగు మధు, ఎర్రం శేఖర్, ముక్తార్ హుస్సేన్, గోక నవీన్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నాగమణి హత్యకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కులాంతర వివాహం చేసుకుందని అగ్రకుల దురహంకారంతో కానిస్టేబుల్ నాగమణిని తన సోదరుడు పరమేష్ కుల దురహంకార హత్య పాల్పడ్డాడని తక్షణమే పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు గ్రామానికి చెందిన కొంగరి నాగమణి అనే కానిసేబుల్ నవంబర్ 10న యాదగిరి గుట్టలో శ్రీకాంత్ అనే దళిత యువకుడిని కులాంతర వివాహం చేసుకుంది. నాగమణి తల్లిదండ్రి లేరు ఆ కుటుంబానికి కొంత ఆస్తి ఉంది. తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకోవడమే కాకుండా ఆస్తిలో వాటా తీసుకుంటుందని నాగమణి తమ్ముడు ఈ ఘాతుకానికి పాల్పడ్డారన్నారు. తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకుంటావా అంటూ డ్యూటీకి వెళ్తున్న కానిస్టేబుల్ నాగమణిని తోబుట్టువైన తన తమ్ముడు పరమేష్ కారుతో వెనుక నుంచి స్కూటీని ఢీకొట్టి వేట కొడవలితో నరికి చంపాడన్నారు. ఈ దారుణ ఘటన అగ్రకుల దురహంకారంతోనే జరిగిందన్నారు. వెంటనే నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నైపుణ్యాభివృద్ధి పెంచేలా సిలబస్ ఉండాలి



'హరిప్రసాద్ బద్రుక స్మారకోపన్యాసం'సదస్సును ప్రారంభిస్తున్న డా. వినయ్ సహస్రబుద్ధే, పద్మశ్రీ డా. హనుమాన్ చౌదరి

కాచిగూడ: విద్యా సిలబస్ జాతీయత, సాంస్కృతిక, చారిత్రక అవగాహన, నైపుణ్యాన్ని పెంపొందించేలా ఉండాలని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ అధ్యక్షుడు డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే తెలిపారు. సోమవారం కాచిగూడలోని బద్రుక కళాశాలలో జరిగిన 'హరిప్రసాద్ బద్రుక స్మారకోపన్యాసం'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాతృభాషలో విద్యా బోధన విద్యార్థులపై అధిక ప్రభావాన్ని చూపుతుందన్నారు. జాతీయ విద్యా విధానాన్ని విద్యా వ్యవస్థ జాతీయ ఐక్యతకు దోహదపడేలా రూపొందించారని అన్నారు. విభిన్న ప్రాంతాలు, భాషలు, పండుగలు, సంప్రదాయాలు బిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిభింబిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీబీసీఐటీ గవర్నింగ్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి, బద్రుక విద్యా సంస్థల చైర్మన్ లక్ష్మీనివాస్ శర్మ, కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక, సంయుక్త కార్యదర్శి రవి బద్రుక, రాజేంద్ర బద్రుక, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ అమలయ్యే వరకు పోరాడతాం

మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అభివాదం చేస్తున్న మాది ఐక్య సంక్షేమ సంఘం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏబీసీడీ వర్గీకరణ అమలయ్యేంత వరకు నిరంతరం పోరాటం చేయాలని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం(మాస్) వ్యవస్థాపక అధ్యక్షులు మిద్దెపాక రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగల రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అప్పికట్ల భరత్ భూషణ్, బంధు సోసైటీ అధ్యక్షులు పల్లెల వీరస్వామి హాజరై మాట్లాడారు. మన జాతి అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా క్షేత్రస్థాయి నుంచి జాతీయస్థాయిలో జాతిని బలోపేతం చేయడం కోసం భవిష్యత్తు కార్యచరణ ప్రాణాలిక రూపొందించాలన్నారు.

◆ మన తరం కోసం కాకపోయినా మన ముందు తరాల కోసమైనా మనమంతా పార్టీలకు సంఘాలకు అతీతంగా ఒకే వేదిక మీదకు వచ్చి జాతీయ అభివృద్ధి కోసం కృషి చేద్దామన్నారు. ఏబీసీడీ వర్గీకరణ అమలయ్యేంత వరకు నిరంతరం పోరాటం చేయాలన్నారు. గూడు లేని పేదలందరికీ ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టే వరకు కృషి చేద్దామన్నారు.

◆ విద్యా హక్కు చట్టం అమలు చేసి ప్రతి కార్పొరేట్ స్కూల్‌లలో, కాలేజీలో 25 శాతం ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యను అందించాలని కోరారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూ ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. ప్రైవేటు రంగ కంపెనీలు రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఓయూ ప్రొఫెసర్ మత్తయ్య, విజయ్‌పాల్, ముత్యాల మురళీధర్, బహుజన రాజ్యాధికర సమితి రాష్ట్ర అధ్యక్షులు వషాపాక నర్సింహ, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను నరసయ్య, సోషల్ జస్టిస్ ఫోరం అధ్యక్షుడు గ్యార శ్రీనివాస్, వీకేసీ పార్టీ అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్, జిలిగి భాస్కర్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

చిక్కడపల్లి: మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డికి తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోల కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ సన్మానించారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుడు శ్రీనివాస్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాకేశ్‌కుమార్, శ్రీనివాస్ గుప్తా, దీన్‌దయాల్‌రెడ్డి, నితిన్, అరుణ్, సాయియాదవ్, శ్రీకాంత్, అర్జున్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేత శ్యాంసుందర్‌కు మాతృవియోగం



మన్నె సరోజ(ఫైల్)

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు నగర సీనియర్ నాయకులు శ్యాంసుందర్ మాతృమూర్తి మన్నె సరోజ(85) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందారు. ఆమెకు శ్యాంసుందర్ చిట్టి, వెంకటేశ్వర్‌రావుతో పాటు మరో ముగ్గురు కుమార్తెలు సంతానం. ఆమె అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం అంబర్‌నగర్ శ్మశానవాటికలో జరిగాయి. ఆమె అంత్యక్రియల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నగర సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, యువజన నాయకులు ముఠా జైసింహ, నగర నాయకులు కె.మాధవ్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, నేత శ్రీనివాస్, కె.సురేందర్, బీజేపీ నాయకులు పి.సాయికృష్ణయాదవ్, శర్మ, ఆర్.నాగేష్, శేషసాయి, కౌండిన్య ప్రసాద్, కిషోర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఘంటసాల గుడికి అపురూప చిత్రపటం



వంశీ రామరాజుకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న గంటి రామకృష్ణ

చిక్కడపల్లి: విఖ్యాత నటులు ఏఎన్‌ఆర్, ఎన్టీఆర్‌లతో ప్రఖ్యాత గాయకులు ఘంటసాల ఉన్న చిత్రపటాన్ని కుంట్లూరులోని ఘంటసాల దేవాలయం ధర్మకర్త వంశీ రామరాజుకు సోమవారం గాయకుడు గంటి రామకృష్ణ అందజేశారు. ఘంటసాల జయంతి సందర్భంగా అపూరూప చిత్రపటం గుడి కోసం అందజేసినందుకు రామకృష్ణకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

కాచిగూడ: అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) తెలంగాణ రాష్ట్ర చైర్మన్ కౌశల్ సమీర్ నేతృత్వంలో రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆ సంఘం ప్రతినిధులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేకేసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగిలి సంపత్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రుద్రాక్ష మల్లేష్, బి.సత్యనారాయణ, ఎం.శివ, మహ్మద్ ఫరూక్‌లు మాట్లాడారు. ఆటో మీటర్ చార్జీలను రూ.20 నుంచి రూ.40కి పెంచాలన్నారు. బైక్ ట్యాక్సీని రద్దు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆటో డ్రైవర్లకు రూ.12వేలు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న ఆటో డ్రైవర్ల సంఘం నేతలు

కుష్టుపై విస్తృత ప్రచారం చేపట్టాలి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా

కాచిగూడ: జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నిర్వహించిన కుష్టు 'వ్యాధిగ్రస్తుల గుర్తింపు'ఉద్యమాన్ని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్టుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కుష్టువ్యాధి కేసుల నివారణకు వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. స్పర్శ లేని తెల్లమచ్చలు ఉన్నవారంతా వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చని అన్నారు. డాక్టర్ ఎస్.మురళీధర్, డాక్టర్ ప్రదీప్, వనిత, కె.శ్రీనివాస్ రెడ్డి, భాగ్యలక్ష్మి, ఆశావర్కర్లు, నర్సులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు' బకాయిలు వెంటనే విడుదల చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫీజు బకాయిలు విడుదలయ్యే వరకు విద్యార్థుల ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కోర్సులు పూర్తయినప్పటికీ విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు జారీ చేయడంలేదని అన్నారు. ఫీజు బకాయిలు రూ.4వేల కోట్లు విడుదల చేయాలని, ఈ విషయంపై సీఎం జోక్యం చేసుకోవాలన్నారు.లేనియెడల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ హాస్టళ్లలో 1,200 మంది విద్యార్థులు కల్తీ ఆహారం వల్ల అస్వస్థతకు గురయ్యారని, 40 మంది మృతి చెందినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తి వేయాలని చూస్తే సహించబోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌటుపల్లి సురేష్, మురళీకృష్ణ, పండరినాథ్, సూర్యనారాయణ, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో మెరుగైన వసతులు కల్పించాలి



కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కాచిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. బీఆర్‌ఎస్-ఎస్‌వీ గురుకుల బాట హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి గుమ్మడి క్రాంతి ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలోని ప్రభుత్వ పాఠశాలను బీఆర్‌ఎస్ నేతలు, ఎమ్మెల్యే సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కనీస వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. టీచర్స్ కొరత ఉందని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ ఇన్‌చార్జి ఎర్ర భీష్మదేవ్, పాండురంగ, అభి ముదిరాజ్, హేమవర్ధన్, సుజయ్ తదితరులు పాల్గొన్నారు.



పద్మప్రియను సన్మానిస్తున్న వంశీరామరాజు, లంకా లక్ష్మీనారాయణ

అలరించిన సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి: సెవెన్ హిల్స్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘంటసాల జయంతి సందర్భంగా చిక్కడపల్లిలోని గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయని గాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను శ్రావ్యంగా సోమవారం సాయంత్రం అలపించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా ఘంటసాల పురస్కారాలను పద్మప్రియ, రుక్మిణితో పాటు పలువురుకి ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో లంకా లక్ష్మీనారాయణ, రాఘవ రెడ్డి, వెంకట్‌రావు, రామలింగేశ్వరావు, భాస్కర్ గుప్తా, డి.శ్రీనివాస్, పి.సత్యనారాయణ, హనుమంతరాయశర్మ, ఏడుకొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ



అంబేడ్కర్ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు, విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన పెంచుకోవాలని అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. ఎయిడ్స్ మహమ్మారి బారినపడకుండా విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోని సమాజ హితం కోసం పని చేయాలని కోరారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ.. రోగ నిరోధక శక్తి వ్యవస్థపై దాడి చేసే వైరస్ నివారణ, వాస్తవాలు, వాటి వల్ల ప్రమాదాలను అంచనా వేసుకోవాలన్నారు. హెచ్ఐవీ వ్యక్తుల పట్ల వివక్షత చూపకుండా వారిని చైతన్యవంతులు చేయాలని సూచించారు. నిరంతరం తగు జాగ్రత్తలు తీసుకుంటూ డాక్టర్ల సూచనలతో మందులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్, వైస్ ప్రిన్సిపల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

చిక్కడపల్లి: పౌరులందరూ రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని వక్తలు అన్నారు. అశోక్‌నగర్‌లోని అమిగోస్ ఏఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం రాజాబహదూర్ వెంకటరామరెడ్డి కళాశాల విద్యార్థులకు భారత రాజ్యాంగంపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. అమిగోస్ అకాడమీ ప్రముఖ ఫ్యాకల్టీ అక్కెంకి నిఖిల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచుత్య దేవి, అమిగోస్ అకాడమీ డైరెక్టర్ ఎంఆర్ రెడ్డిలు మాట్లాడుతూ.. పౌరులందరూ భారత రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి మూల స్తంభం అయిన రాజ్యాంగం గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదల వైద్యానికి తన వంతు చేయూతను ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం గోల్నాకలోని ఆయన క్యాంపు కార్యాలయంలో 18 మందికి మంజూరైన రూ.5.65 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చొరువ తీసుకుంటానని అన్నారు.

11న ఢిల్లీలో ఓబీసీల జాతీయ సదస్సు

కాచిగూడ: బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో బీసీల సమరశంఖారావం పేరుతో ఓబీసీల జాతీయ సదస్సు, ధర్నాను నిర్వహిస్తున్నట్లు ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు తెలిపారు. ఢిల్లీలోని కానిస్టిట్యూషనల్ క్లబ్‌లో ఓబీసీల జాతీయ సదస్సు 12న జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెసక్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనాభా గణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక బోధనలు మెరుగైన సమాజానికి దోహదం



రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రతినిధులు

అంబర్‌పేట: క్రిష్టియన్‌ల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని తెలంగాణ క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తెలిపారు. శనివారం గోల్నాకలోని బేతాల్ గ్రాస్పెల్ చర్చ్‌లో అంబర్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ... ఐకమత్యంతో హక్కులను సాధించుకోవాలన్నారు. ఆధ్యాత్మిక బోధనలు మెరుగైన సమాజానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రెవరెండ్ జోసఫ్ కిశోర్, రెవరెండ్ జీ.వరకుమార్, బిషాఫ్, కె.సధాకర్, రెవరెండ్ కె.జాసన్‌రాజు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

అనేక వైవిధ్యాలు, వైరుధ్యాలకు నిలయం తెలంగాణ రాష్ట్రం

చిక్కడపల్లి: అపురూపమైన అనేక వైవిధ్యాలు, వైరుధ్యాలకు నిలయం తెలంగాణ రాష్ట్రమని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సాంస్కృతిక సంస్థ కళానిలయం ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో ఇటీవల విడుదలైన కేసీఆర్ చిత్రబృందానికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన నటీనటులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బేవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీ ప్రసాద్, మాజీ డీసీపీ సుంకర సత్యనారాయణ, మేము సైతం యువసేన ఫౌండేషన్ ఫౌండర్ చకిలం స్వప్నశ్రీనివాస్, సంఘసేవకులు వీరభోగ వసంతరాయలు, అధ్యక్షుడు సురేందర్, దయాకర్‌రాజు, కార్యదర్శి పుష్ప తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్ర బృందాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మధుసూధనాచారి

మార్జాలం.. మమకారం!

పెంపుడు పిల్లి మృతి.. అంతిమ సంస్కారాలు నిర్వహించిన యజమాని





అంబర్‌పేట శ్మశానవాటికలో అంతిమ సంస్కారాల్లో పుండరీ చారి కుటుంబం

అంబర్‌పేట: కంటికి రెప్పలా.. 21 ఏళ్లుగా పెంచుకున్న పిల్లి చనిపోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరయ్యింది. మృతి చెందిన పిల్లికి శాస్త్రప్రకారం అంతిమ సంస్కారాలు చేసి దానిపై వారికున్న ప్రేమను చాటుకున్నారు. ఈ సంఘటన అంబర్‌పేట నియోజకవర్గంలోని పటేల్‌నగర్‌లో జరిగింది. పటేల్‌నగర్‌కు చెందని జూలూరి పుండరీచారి, శ్రీదేవి దంపతులు 2004 సెప్టెంబర్ 19న అప్పుడే జన్మించిన పిల్లి కూనను చేరదీసి పెంచుకున్నారు. సహజంగా పిల్లి జీవితకాలం 12 నుంచి 14 సంవత్సరాలు ఉంటుంది. కానీ అందుకు బిన్నంగా ఈ పిల్లి 21 సంవత్సరాలు జీవించడం విశేషం. పిల్లి మృతి చెందాడంతో కుటుంబం అంబర్‌పేటలోని హిందూ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.